క్లుప్తంగా

కోతుల బెడదకు చెక్..

పొలంలో కొండముచ్చు ఫొటో



పొలంలో ఏర్పాటు చేసిన కొండముచ్చు ఫొటో

హత్నూర (సంగారెడ్డి): కోతుల భారీ నుంచి పంట రక్షణ కోసం రైతులు చేలల్లో కొండ ముచ్చు ఫొటోలతో బ్యానర్లను ఏర్పాటు చేశారు. హత్నూర గ్రామ శివారులో పంటలపై కోతులు దాడి చేయడంతో పంట నష్టం వాటి ల్లింది. దీంతో పంటల రక్షణ కోసం కొండ ముచ్చు ఫొటో బ్యానర్లను పొలం మధ్యలో ఏర్పాటు చేయడంతో కోతుల బెడద తగ్గిందని పలువురు రైతులు తెలిపారు.

106 సైలెన్సర్లు ధ్వంసం



సైలెన్సర్లను ధ్వంసం చేస్తున్న పోలీసులు

సంగారెడ్డి క్రైమ్: పట్టణంలో అధిక శబ్దం చేస్తున్న 106 బైక్ సైలెన్సర్లను స్థానిక కొత్త బస్టాండ్ ఎదుట డీఎస్పీ సత్తయ్య గౌడ్ ఆధ్వ ర్యంలో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సత్తయ్య గౌడ్ మాట్లాడుతూ.. పట్టణంలో మూడు రోజులుగా నిబంధనలకు విరుద్ధంగా డబుల్ సైలెన్సర్లతో ప్రజల ప్రశాంతతకు భం గం కల్గిస్తున్న వారిపై ప్రత్యేక తనిఖీలు నిర్వ హించారు. ఈ మేరకు 106 బైక్ సైలెన్సర్లను సీజ్ చేసినట్లు తెలిపారు. గురువారం వాటిని కొత్త బస్టాండ్ ఆవరణలో రోడ్డు రోలర్‌తో ధ్వం సం చేశారు. కార్యక్రమంలో పట్టణ సీఐ, ట్రాఫిక్ సీఐ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ



బోధన తీరును పరిశీలిస్తున్న ఎంఈఓ

కల్హేర్(నారాయణఖేడ్): విద్యార్థులకు నాణ్య మైన బోధన చేయాలని కల్హేర్ ఎంఈఓ గంజి శ్రీనివాస్ సూచించారు. గురువారం కల్హేర్‌లో యూపీఎస్, దళితవాడ పాఠశాల, ఇందిరాన గర్ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం పథకం పరిశీలించారు. కార్యక్రమంలో టీచర్లు లక్ష్మి, రాజుకుమార్ పాల్గొన్నారు.

యూనిఫాం అందజేత



విద్యార్థులతో రాంరెడ్డి, సుభాశ్‌రెడ్డి తదితరులు

సంగారెడ్డి: పాఠశాల విద్యార్థులకు స్కూల్ యూనిఫాం గురువారం అందజేశారు. చౌటా కూర్ మండలంలోని పోసన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ పర్కల రామ్‌రెడ్డి తన సొంత డబ్బులతో 65 మంది విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయులు అర్జున్, మాజీ సీడీసీచైర్మన్ సుభాశ్ రెడ్డి, నాయకులు మొగులయ్య ఉపాధ్యా యులు తదితరులు పాల్గొన్నారు.

కమ్ముకున్న పొగమంచు



దట్టంగా కమ్ముకున్న పొగమంచు

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో గురువారం తెల్లవారు జామున దట్టమైన పొగమంచు అలుముకుంది. ఉ. 8 గంటల వరకు పొగమంచు వీడకపోవడంతో రోడ్లపై ఎదురెదురుగా వస్తున్న వాహనాలు అతిసమీపం వరకు వస్తేగాని కనిపించని పరిస్థి తులు నెలకొన్నాయి. ప్రమాదాలకు ఆస్కారం ఉండటంతో వాహనచోదకులు లైట్లు వేసుకొని మెల్లగా నడిపారు. ఉ.8 గంటల తరువాత క్రమక్రమంగా పొగమంచు తొలగిపోయి సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి.

మండల పరిషత్తు నిధులపై అడిటింగ్

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్ మండల పరిష త్తులో నిధుల ఖర్చుపై గురువారం అడిటింగ్ చేశారు. లోకల్ ఫండ్ అడిటర్ తిరుమలయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ నిధులు, జనరల్ ఫండ్, ఎస్ఎఫ్‌సీ నిధుల ఖ ర్చుపై ఆరా తీశారు. అనంతరం రికార్డులు పరి శీలించారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాలాల ఆక్రమణలు.. యథేచ్ఛగా నిర్మాణాలు

- అధికారుల ఉదాసీనత
- అవస్థలు పడుతున్న ప్రజలు



నాలాను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఏఈ, జానకీరాం తదితరులు



కుచించుకుపోయిన బ్యాంక్ కాలనీలోని ప్రధాన నాలా

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ప్రధాన నాలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. కొందరు నాలాల్లో మట్టి నింపి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులు ఉదా సీనంగా వ్యవహరిస్తున్నారు. జహీరాబాద్ పట్టణం 65వ జాతీయ రహదారిపై ఉండటంతో శరవేగంగా అభివృద్ధి చెందుతుంది. నిమ్జ్ ప్రాజెక్టు కూడా రావ డంతో పట్టణంలోని ప్లాట్ల రేట్లు విపరీతంగా పెరి గాయి. ఆక్రమణల వల్ల వెడల్పుగా ఉన్న నాలాలు కుచించుకుపోతున్నాయి. దీంతో వర్షాకాలంలో వరద నీరు రోడ్లపైకి వస్తుంది. మురికి నీరు కూడా రోడ్లపై పారుతుంది. జహీరాబాద్ పట్టణంలో హౌసింగ్‌బోర్డు నుంచి ఎస్‌బీహెచ్ కాలనీ మీదుగా ప్రవహించే పెద్ద నాలా ఆక్రమణలకు గురైంది. నాలాకు ఇరువైపులా నిర్మాణాలు చేపట్టడంతో కాల్వ చాలా చిన్నదయింది. వర్షాకాలంలో వచ్చే వరద నీరు రోడ్డుపైకి వస్తుంది. రైల్వే గేటు వద్ద రహదారి దాటుతూ గతంలో పెద్ద నాలా ఉండేది. ఆక్రమణల వల్ల కాల్వ కనుమరుగైంది. బాగారెడ్డి పల్లి అండర్ బ్రిడ్జి సమీపంలో ఉన్న పెద్ద కాల్వ కబ్జాకు గురై కుదించుకుపోయింది. దీంతో దగ్గరలో ఉన్న అండర్ బ్రిడ్జిలోకి వర్షం నీరు వచ్చి చేరుతుం ది. పట్టణంలోని ఆర్యనగర్ గుండా ప్రవహించే పెద్ద నాలా కూడా ఆక్రమణలకు గురై చిన్నది మారింది. ఇలా పట్టణంలోని పలు ప్రాంతాల్లో నాలాలు కబ్జాకు గురికావడంతో వర్షం, మురికి నీరు రోడ్లపైకి వచ్చి ప్రజలు అవస్థలు పడు తున్నారు. మున్సిపల్, ఇతర ప్రభుత్వ శాఖల అధి కారులు నాలాల ఆక్రమణలు తొలగించే ప్రయత్నా లు చేయడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. జాగో తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపకులు రాములు నేత మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కమిషనర్ సుభాశ్‌రావు ఆదేశాల మేరకు ఇరిగేషన్ శాఖ ఏఈ జానకీరాం ఇటీవల కబ్జాకు గురైన బాగారెడ్డి పల్లి నాలాను పరిశీలించారు.

నాలాలను కాపాడాలి



కొంతమంది అక్రమార్కులు నాలా లను కబ్జా చేసి నిర్మాణాలు చేపడు తున్నారు. కొన్ని సంవత్సరాల నుం చి ఆక్రమణలు యథేచ్ఛగా కొనసా గుతున్నా పట్టించుకునే వారు కరువై య్యారు. మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసుశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి నాలాలను కాపాడాలి.

–రాములునేత, జాగో తెలంగాణ అధ్యక్షుడు, జహీరాబాద్

చర్యలు తీసుకుంటాం



నాలాల ఆక్రమణలపై దృష్టి పెడుతున్నాం. నాలాలను కబ్జా చేస్తే శిక్షిస్తాం. నాలాలపై అక్రమ నిర్మాణాలను గుర్తించి ఉన్నత అధికారులకు నివేదిక తయారు చేసి పంపుతాం. అధికారుల ఆదే శాల మేరకు తగిన చర్యలు తీసుకుంటాం.

–సుభాశ్‌రావు, కమిషనర్, జహీరాబాద్

బాణాసంచా దుకాణాలకు మార్కింగ్



మార్కింగ్ చేస్తున్న అగ్నిమాపక, మున్సిపల్ సిబ్బంది

నారాయణఖేడ్: దీపావళి పండుగను పురస్కరిం చుకుని బాణాసంచా దుకాణాల ఏర్పాటుకు ఖేడ్ తహసీల్ గ్రౌండ్‌లో స్థలం కేటాయించారు. ఇది వరకే మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జగ్జీ వన్ లాటరీ ద్వారా దుకాణాలు కేటాయించారు. తహసీల్ కార్యాలయం ఎదుట నుంచి అటవీశాఖ కార్యాలయం వరకు, అక్కడి నుంచి పంచాయతీ రాజ్ శాఖ కార్యాలయం వరకు ఎల్ ఆకారంలో ఏర్పాటు చేసుకోవాలని నిర్దేశించారు. గురువారం మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, శానిటరీ అధికారి శ్రీనివాస్, అగ్నిమాపక కేంద్రం అధికారి శ్రీధర్ పర్యవేక్షణలో అగ్నిమాపక, మున్సిపల్ సిబ్బంది దుకాణాల ఏర్పాటుకు మార్కింగ్ వేశారు.

అక్రమ కట్టడాలను తొలగించండి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నర్సింలు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని నాలాలపై నిర్మిం చిన అక్రమ కట్టడాలను తొలగించాలని సీపీఐ నాయకులు గురువారం మున్సిపల్ కమిషనర్ సుభాశ్‌రావును కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ డివిజన్ కార్య దర్శి నర్సింలు మాట్లాడుతూ.. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న నాలాలను ఆక్రమార్కులు కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారని ఆరోపించారు. వెడల్పుగా ఉన్న నాలాలు ఆక్రమణల వల్ల కను మరుగైయ్యాయని మండిపడ్డారు. దీంతో వర్షం, మురుగు నీరు రోడ్లపైకి వస్తుందని తెలిపారు. నాలాలపై పెద్ద పెద్ద భవనాలు కూడా నిర్మించారని చెప్పారు. అనంతరం ఇరిగేషన్ శాఖ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు.

వేగంగా ఇళ్ల నిర్మాణాలు చేయండి

ఎంపీడీఓ సత్తయ్య



ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ సత్తయ్య పేర్కొన్నారు. గురువారం ఆయన మండలంలోని భీంరా తండాలో నిర్మాణం లో ఉన్న ఇళ్లను పరిశీలించారు. అనంతరం ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు ఉన్న కూలీలకు ఈకే వైసీ అప్‌డేట్ పనులు పరిశీలించారు. మండల కేం ద్రంలోని బీసీ సంక్షేమ వసతి గృహాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఉదయం అల్పాహారం సమయంలో మెనూ పరిశీలించారు. 110 మంది విద్యార్థులకు.. 93 మంది విద్యార్థులు హాజరు ఉన్నట్లు తెలిపారు. భీంరా తండాలో ప్రైమరీ పాఠశాలలో హాజరు పరి శీలించారు. 39 మంది విద్యార్థులకు గాను 32 మం ది హాజరైనట్లు పేర్కొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం సీపీఆ ర్‌పై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితిలో సీపీఆర్ చేయాలని 108 ఈఎంటి గురప్ప విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమం లో ఎంఈఓ నాగరం శ్రీనివాస్, పైలట్ రవీం దర్‌గౌడ్ పాల్గొన్నారు.

గణితం.. అతి సులభం

ఎంపీడీఓ సత్తయ్య



గణితంపై మోటివేషన్ క్లాస్ బోధిస్తున్న ఎంపీడీఓ

కంగ్టి(నారాయణఖేడ్): గణితశాస్త్రంతో మానవ జీవన అనుబంధం తెలియపరుస్తూ సంఖ్య వ్యవస్థ పరిణామ క్రమం గురించి కం గ్టి కేజీబీవీ బాలికలకు ఎంపీడీఓ సత్తయ్య గురువారం ప్రత్యేక తరగతి నిర్వహించారు. పదవ తరగతి బాలికలకు మోటివేషన్ క్లాస్ తీసుకొన్నారు. విద్యార్థుల్లో గణితంపై ఉన్న భయాన్ని తొలగించే క్రమంలో గణితంలో ఆసక్తి నెలకొనేలా మోటివేట్ చేశారు. గణితం లో సంఖ్య వ్యవస్థ, సంకలనం, వ్యవకలనం పై జీవితంలో ఆవశ్యకతపై వివరించి విద్యా ర్థుల్లో గణితంపై ఆసక్తిని కల్పించారు. కార్య క్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయులు, ఎస్ఓ పాల్గొన్నారు.

టీకాలు తప్పనిసరి

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్‌లో గురువారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. గోపాలమిత్ర గుర్రపు శ్రీని వాస్ మాట్లాడుతూ.. పశువులకు టీకాలు వేయించాలని రైతులకు సూచించారు. కార్య క్రమంలో వెటర్నరీ సిబ్బంది నారాయణ, రైతు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మల్టీపర్పస్ జీఓను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజయ్య

కొండాపూర్ (సంగారెడ్డి): గ్రామ పంచాయతీ కారి ్మకుల సమస్యలను పరిష్కరించడంతో పాటు పెం డింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని సీఐటీయూ మండల నాయకులు రాజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రం కొండాపూర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ.. జీఓ నంబర్ 51 సవరించి మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. గ్రామపంచాయతీలో పనిచేసే కార్మికులకు సరుకులు, సబ్బులు, బెల్లం, సం వత్సరానికి రెండు జతలు బట్టలు, బూట్లు, నూనె, ప్రతి కార్మికుడికి రూ.9,500 జీతం ఇవ్వవాల్సి ఉం టుందన్నారు. కానీ పంచాయతీ కార్మికులకు అవి ఏమీ అందడం లేదన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికులు సంజీవులు, వెంకయ్య, విజేందర్, కృష్ణ, కమలమ్మ, సంతోష, ఆంజనేయు లు, కిషన్, సంతోష, భాస్కర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **యువకులపై కేసు నమోదు**

న్యాల్‌కల్(జహీరాబాద్): పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన ముగ్గురు యువకులపై హద్నూర్ పోలీ సులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ సుజిత్ కథనం ప్రకారం.. న్యాల్‌కల్ గ్రామానికి చెం దిన ముగ్గురు యువకులు బుధవారం రాత్రి నారా యణఖేడ్–బీదర్ రోడ్డుపై న్యాల్‌కల్ శివారులో మద్యం సేవిస్తున్నారు. గస్తీ నిర్వహిస్తున్న పోలీ సులు సాయికుమార్, మహేశ్‌లు అర్ధరాత్రి ఇక్కడ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మమ్ములనే ప్రశి ్నస్తారా? అంటూ యువకులు పోలీసులపై దురు సుగా ప్రవర్తించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

◆ **పుట్టినరోజున మొక్క, పుస్తకం**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పుట్టినరోజు వచ్చిందంటే విద్యార్థులు తన తోటి స్నేహితులకు చాక్లెట్లు పంచడం సంప్రదాయం. ఈ మధ్యకాలం లో ఉపాధ్యాయులు విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో విద్యా ర్థుల్లో మార్పు వచ్చింది. అందులో భాగంగా గురు వారం ఆరవ తరగతి చదువుతున్న నరసింహ పుట్టిన రోజున మోరల్ స్టోరీ పుస్తకం, ఏడో తరగతి విద్యార్థి ప్రణయ్ పూల మొక్కను అందించారు.

◆ **జీపీ భవన నిర్మాణ పనులు ప్రారంభం**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని తాట్‌ప ల్లిలో గురువారం పంచాయతీ భవనం నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. నూతనంగా ఏర్ప డిన గ్రామ పంచాయతీకి పంచాయతీ భవనం మం జూరైంది. భవన నిర్మాణానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.20 లక్షలు మం జూరయ్యాయి. ఆ నిధులతో చేపట్టనున్న పనులను పంచాయతీ రాజ్ జహీరాబాద్ డిప్యూటీ ఈఈ జ్యోతి ప్రారంభించారు.

◆ **బీఆర్ఎస్‌లో పలువురు చేరిక**

మునిపల్లి(అందోల్): బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధికి కృ షి చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు సూచించి నట్లు తాజా మాజీ జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్ పేర్కొన్నారు. మండలంలోని బోడపల్లి తాజా మాజీ సర్పంచ్ బిందు రామకృష్ణ, చిన్నచల్మెడ తాజా మాజీ సర్పంచ్ విజయ్ భాస్కర్‌లు ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి హరీశ్‌రావు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించినట్లు తెలిపారు.

◆ **విద్యార్థినికి సన్మానం**

న్యాల్‌కల్(జహీరాబాద్): సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో మండల పరిధిలోని మిర్జాపూర్(బి) జెడ్పీహెచ్ఎ స్‌కు చెందిన విద్యార్థిని శృతి జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి సాధించింది.

వార్డుల విభజన ముసాయిదా విడుదల



నోటీస్ బోర్డు విడుదల చేస్తున్న కమిషనర్

జిన్నారం: జిన్నారం మున్సిపాలిటీ పరిధిలో 20 వార్డులకు సంబంధించిన డీలిమిటేషన్ ముసాయి దాను గురువారం మున్సిపల్ కమిషనర్ తిరుపతి కార్యాలయం నోటీసు బోర్డులో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంగా ఉన్న జిన్నారంను ఇటీవల ప్రభుత్వం మున్సిపాలిటీగా చేసింది. వార్డుల సరిహద్దుల ఖరా రులో భాగంగా ప్రజల నుంచి వచ్చే అభి ప్రాయాలు, సూచనలు, సలహాలు ఆహ్వానిస్తు న్నట్లు పేర్కొన్నారు. నిర్దిష్ట గడువులో ఈ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. దీనికి సంబంధించిన ముసా యిదా జాబితాను నోటీసు బోర్డులో ప్రదర్శిం చామని తెలిపారు.

అక్రమ నిర్మాణాలపై కొరడా



అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తున్న జేసీబీ

జిన్నారం(పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపా లిటీ కాజీపల్లి గ్రామ సమీపంలోని సర్వే నంబర్ 181లో అక్రమ కట్టడాలు జోరుగా సాగుతున్నా యన్న ఫిర్యాదులపై రెవెన్యూ, పోలీసులు స్పందిం చి ఉక్కుపాదం మోపాయి. ఈ మేరకు గురువారం జిన్నారం తహసీల్దార్ దేవదాసు ఆదేశాలతో మున్సి పల్, రెవెన్యూ యంత్రాంగం సంయుక్తంగా అక్రమ నిర్మాణాలను జేసీబీ సహాయంతో పూర్తిగా నేలమట్టం చేశారు. అనంతరం అధికారులు మాట్లా డుతూ.. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ స్థలాలను పరిరక్షించే క్రమంలో అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ రవీందర్ రెడ్డి, ఆర్ఐ జయప్రకాష్ నారాయణ, రెవెన్యూ, పోలీస్ పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు



శిక్షణ ఇస్తున్న టాస్క్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీనివాస్

జహీరాబాద్ టౌన్: నైపుణ్య శిక్షణతో ఉపాధి అవ కాశాలు లభిస్తాయని టాస్క్ ప్రొగ్రామ్ ఆఫీసర్ శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్స్ అండ్ నాలెడ్జ్(టాస్క్)ఆధ్వర్యంలో పట్టణం లోని వశిష్ట డిగ్రీ కళాశాలలో గురువారం శిక్షణ తర గతులు ప్రారంభమయ్యాయి. ఆరు రోజుల పాటు కొనసాగే శిక్షణ తరగతులను ప్రిన్సిపాల్ సిద్దారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ అధికారి మాట్లాడుతూ.. టాస్క్‌శిక్షణ తరగతుల ద్వారా అవసరమైన నైపుణ్యాలను అందించను న్నట్లు చెప్పారు. విద్యార్థులు సద్వినియోగం చేసు కోవాలని కోరారు. ఈ సందర్భంగా కమ్యూనికేషన్ స్కిల్స్, టీంవర్క్, వే ఆఫ్ అండర్ స్టాండింగ్, లింజి నింగ్ స్కిల్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్ర మంలో ప్రిన్సిపాల్ సిద్దారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మారుతిరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాలి



ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

జహీరాబాద్ టౌన్: అభివృద్ధి పనులు చేపట్టాలని పట్టణంలోని గాంధీనగర్, గుల్షన్‌నగర్, సలాంనగర్ కాలనీవాసులు గురువారం ఆర్డీఓ కార్యాలయం వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ కాలనీల్లో కనీస మౌలిక వసతులు లేవన్నారు. మురికి కాల్వలు, రోడ్లు, కరెంట్ స్తంభాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని వాపోయారు. మున్సిపల్ అధికారులకు పలుమార్లు వినతి పత్రాలు అందజేసిన ప్రయోజ నం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి రో డ్లు, మురికి కాల్వలు నిర్మించాలని కోరారు. ఈ మే రకు ఆర్డీఓ దేవుజాకు వినతిపత్రం అందజేశారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): క్రీడల్లో గెలుపోట ములు సహజమని వాటిని స్ఫూర్తిగా ముందుకు సాగాలని భెల్ కమ్యూనిటీ సెంటర్ అధ్యక్షుడు, జన రల్ మేనేజర్ టి.నందు అన్నారు. గురువారం రాత్రి కమ్యూనిటీ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన భెల్ ఇంటర్ యూనిట్ వాలీబాల్ క్రీడాపోటీల ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విజయం సాధించిన తిరుచి యూనిట్ జట్టుకు బహుమతి అందజేశారు. అనం తరం ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులకు నిలయం భెల్ టౌన్‌షిప్ అని అన్నారు. ఈ క్రీడా మైదానంలో ఆడిన అనేక మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ క్రీడాల్లో రాణించారని గుర్తు చేశారు. భెల్ కార్మికులు అన్ని రంగాల్లో రాణించేలా యాజమాన్యం ప్రోత్సహిస్తుందని తెలి పారు. కార్యక్రమంలో జీఎం డాక్టర్. సంధ్యాకర్, సీసీ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, అధికారులు రవీం దర్, సత్యబాబు పాల్గొన్నారు.

లింగాయత్ సమాజ్ అభివృద్ధికి కృషి

జిల్లా అధ్యక్షుడు నర్సింలు



కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

జహీరాబాద్ టౌన్: లింగాయత్ సమాజ్ అభివృద్ధికి కృషి చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇప్పె పల్లి నర్సింలు కార్యవర్గ సభ్యులను కోరారు. పట్ట ణంలోని బసవ ఫంక్షన్ హాల్‌లో గురువారం నియో జకవర్గం స్థాయి లింగాయత్ సమాజ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. నర్సింలు మాట్లాడుతూ.. లింగాయత్ సమాజం అనేక సమస్యలను ఎదు ర్కొంటుందని.. వాటిపై దృష్టి సారించించా లన్నారు. అనంతరం వీరశైవ లింగాయత్ సమాజ్ నియోజకవర్గం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్య దర్శి రాజేశ్వర్, కోశాధికారి పోలీస్ సంతోష్ పాటిల్, జహీరాబాద్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రాజశేఖర్ షెట్కార్, సుభాష్, నాయకులు అరుణకౌ లాస్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయానికి తాళం



నిరసన తెలుపుతున్న ఐడీఎస్ఎంటీ కాలనీవాసులు



ఆందోళనకారులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

- ఐడీఎస్ఎంటీ కాలనీవాసుల నిరసన
- ఆందోళనకారుల అరెస్టు చేసిన పోలీసులు

జహీరాబాద్ టౌన్: ప్రైవేట్ వ్యక్తులు తమ ఇళ్లు, ప్లాట్లను ధ్వంసం చేస్తున్నారని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ జహీరా బాద్ ఐడీఎస్ఎంటీ కాలనీవాసులు గురువారం మున్సిపల్ కార్యాలయానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు నామ రవికిరణ్, తంజీమ్ తదితరులు నిరసనలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భం గా బాధితులు మాట్లాడుతూ.. పట్టణంలోని 158 సర్వే నంబర్‌లోని ఐడీఎస్ఎంటీ కాలనీలో ప్రభుత్వం ఇచ్చిన ప్లాట్లలో ఇళ్లను కట్టుకుని 25 సంవత్సరాలుగా నివసిస్తున్నామన్నారు. కొంత మంది ప్రైవేట్ వ్యక్తులు జేసీబీలతో అర్ధరాత్రి ఇళ్లు, ప్లాట్లను ధ్వంసం చేస్తున్నారని వాపో యారు. స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జహీరాబాద్ టౌన్ సీఐ శివలింగం, ఎస్ఐ, వినయ్‌కుమార్‌లు అక్కడి చేరుకుని మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న బాధితులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.